నామినేటెడ్, కార్పొరేషన్ పదవుల్లో

బీసీలకు 50 శాతం కేటాయించాలి

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయబోయే కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు ఇతర నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు జనాభా ప్రకారం 50 శాతం కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమం సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీలో సమర్థులైన బీసీ నాయకులు ఉన్నారని, వారి సేవలను గుర్తించాలని కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం చేసిందని, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు కూడా ఇవ్వలేదన్నారు. పంచాయతీ రాజ్ సంస్థల్లో రిజర్వేషన్లు 34 శాతం నుంచి 20 శాతానికి తగ్గించారని, ప్రైవేటు యునివర్సిటీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, రిజర్వేషన్లు ఎత్తి వేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు బడ్జెట్ ఇవ్వలేదన్నారు. గతంలో బీసీలకు జరిగిన అన్యాయం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగరాదని హితవు పలికారు. రాహుల్‌గాంధీ బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు, ఉదయపూర్ డిక్లరేషన్లు అమలు చేయాలని కోరారు. ఇటీవల నలుగురు ప్రభుత్వ సలహాదారులలో ఒక్కరూ కూడా బీసీ లేరన్నారు. బీసీ సంక్షేమ శాఖలో కమిషనర్ లేక పాలన కుంటు పడుతుందన్నారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్ల కేటాయించాలని, ఇంజినీరింగ్ విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని, బీసీ బంధు పథకం ప్రవేశపెట్టి ప్రతి బీసీ కుటుంబానికి రూ.20 లక్షల మంజూరు చేయాలని కోరారు. మంత్రి వర్గంలో 50 శాతం కోటా ఇవ్వాలన్నారు.

భారత రాజ్యాంగ రథయాత్ర



కాచిగూడ: భారత రాజ్యాంగ పుస్తకంతో ధర్మ సమాజ్ పార్టీ ప్రతినిధులు శుక్రవారం రథయాత్ర నిర్వహించారు. బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయం నుంచి హిమాయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం మీదుగా ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ, రథయాత్ర కొనసాగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ నేతలు మేడి కార్తీక్, ఉదయ్ కుమార్, నర్సింగ్‌రావు తెలిపారు. రాజ్యాంగాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సింగారం లింగుస్వామి, సంతోష్, కృష్ణ, మల్లేష్, సైదులు, శివరాజ్, రాజీవ్, శివ, దేవానంద్, సాయి, గోపాల్, మోడి రమేష్, విక్రమ్ బాబు, మహేష్, నర్సింగ్‌రావు, రాము, వెంకట్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ ధనలక్ష్మి నారాయణ కల్యాణం



మురళీధర్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి

కవాడిగూడ: శ్రీ సిద్ధేశ్వపీఠం కుర్తాళం ఆధ్వర్యంలో శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి 88వ అవతరణ ఉత్సవాలు శుక్రవారం 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ స్టేడియంలో శ్రీ ధన లక్ష్మి నారాయణ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరానంద భారతి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో రమ్యానంద భారతి స్వామి, పీఠం కో ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మాచర్ల శశి భూషణ్, నగర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాయి జ్యోత్స్నకు ఫిజియోథెరపీలో ఆల్ రౌండర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సాయి జ్యోత్స్న

నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఫిజియోథెరపీ కళాశాల(డీడీసీటీపీ)లో బీపీటీ విద్యార్థిని కొండుర్తి సాయి జ్యోత్స్న ఫిజియోథెరపీ, మ్యూజిక్ థెరపీ, జిమ్ థెరపీ, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గానూ బెస్ట్ ఆల్ రౌండర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ విశ్రాంత ముఖ్య కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా ఆమెకు మెడల్ అందజేసి అభినందించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఐవైఆర్ కృష్ణారావు, ప్రభాకర్, డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఎన్. ఉషా రెడ్డి, డీడీసీటీపీ కార్యదర్శి లక్ష్మీ సుందరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఛాయా నందిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నియోకర్సర్ వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నియోకర్సర్ సొసైటీ 8వ వార్షికోత్సవం శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నియోకర్సర్ డైరెక్టర్ బొజ్జ భిక్షమయ్య మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా 13 వేల మంది విద్యార్థి, విద్యార్థినులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తద్వారా ఐదు వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులచే సంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, నియోకర్సర్ కార్యదర్శి జగదీష్‌కుమార్, సామాజిక కార్యకర్త ఎం.శ్రీనివాస్, పి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రమోద్‌కుమార్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సోషియాలజీ విభాగం పరిశోధక విద్యార్థి కొత్తూరు ప్రమోద్‌కుమార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టా లభించింది. సోషియాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ పరాంకుశం వెంకటరమణ పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్కీమ్స్ ఇన్ డెవలప్‌మెంట్ ఆఫ్ షెడ్యూల్డ్ కాస్ట్ స్టూడెంట్స్ – ఎ సోషియోలజికల్ స్టడీస్ ఆఫ్ వరంగల్, డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

గద్దర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజా యుద్ధనౌక దివంగత గద్దర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం తగదని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఉస్మానియా యూనివర్సిటీలో పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏఐఎస్ఎఫ్, అంబేద్కర్ విద్యార్థి సంఘం, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా, రామచంద్రపురం మండలం, తెల్లాపూర్ మున్సిపాలిటీలో అనుమతి తీసుకుని ఏర్పాటు చేస్తున్న గద్దర్ విగ్రహం నిర్మాణానికి అడ్డంకులు సృష్టిస్తున్న హెచ్ఎండీఏ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా ప్రభుత్వం జోక్యం చేసుకుని విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని విద్యార్థి నాయకులు కోరారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నేతలు నెల్లి సత్య, నామ సైదులు, లెనిన్, దివాకర్, నాగేందర్, సునీల్, రాఘవేందర్, బసవరాజు, వెంకటేష్, రణధీర్, వీరన్న, రవి తదితరులున్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు



ఇందిరాపార్కు చౌరస్తాలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

మువ్వన్నెల రెపరెపలు

ముషీరాబాద్, అంబర్‌పేట్ నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా డివిజన్లలో నాయకులు జాతీయ జెండాలను ఎగరవేశారు. పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. –ముషీరాబాద్, అంబర్‌పేట్ జోన్ బృందం



శ్రీవిద్యా స్కూల్‌లో..



అడిక్‌మెట్‌లో జాతీయ జెండాను ఎగరవేసిన పీసీసీ రాష్ట్ర కార్యదర్శి జి.ఎన్.కేశవ్.



అరుంధతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్



అడిక్‌మెట్‌లో..



భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో..



రాంనగర్ డివిజన్‌లో..



బండారు దత్తాత్రేయ నివాసం వద్ద..



పటేల్‌నగర్ చౌరస్తాలో..



అంబర్‌పేట్ డివిజన్‌లో..



చే నంబర్ చౌరస్తాలో..



తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో.



ముషీరాబాద్‌లో ..



సహారా బేకరీ వద్ద..

చదువు నిరంతర ప్రక్రియ

నల్లకుంట: చదువు నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఆయన న్యూనల్లకుంటలోని బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహం హాల్‌లో విద్యార్థులతో సమావేశమయ్యారు. ట్రస్ట్ అధ్యక్షుడు మంత్రి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధిపత్య భావజాలం లేకుండా ఉండటం, ఆశ్చర్య శీలత, సంస్కారం, సాటి మనిషి పట్ల జాలి దయ కలిగి ఉండడం ప్రతి విద్యార్థికి అవసరమన్నారు. ఇవన్నీ అలవడాలంటే చరిత్ర చదవాలని, తత్వ శాస్త్రాన్ని అర్థం చేసుకోవడంతో పాటు, సామాజిక పరిణామాలను అధ్యయనం చేయాయాలన్నారు. కేవలం యువత కెరీర్ ఓరియెంటెండ్‌గా ఉండటం సమంజసం కాదన్నారు. కేవలం ఉద్యోగం సాధించడంతోనే, ఆర్థికంగా మెరుగు పడడంతోనే మానవ జీవితానికి సంబంధించిన పరమార్థం కాదన్నారు. చదువు అనేది నిరంతర ప్రక్రియ అని, సర్టిఫికెట్ అందుకోగానే చదువు పూర్తయినట్లుకాదని, చదువు నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని నిరంతరం అధ్యయనం చేస్తూ ఒక చక్కని పౌరులుగా, నాగరికులుగా, స్వేచ్ఛా




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

సామానత్వం, సౌభ్రాతృత్వం లాంటివి పరిరక్షించడానికి కావాల్సిన మానసిక పరివర్తన కల వారిగా రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేద బ్రాహ్మణ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం బ్రాహ్మణ హాస్టల్ ట్రస్ట్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ విశ్రాంత రీజనల్ మేనేజర్ పీఆర్‌వీ రామచంద్ర రావు, తెలంగాణ అడ్మిషన్ ఫీ రెగ్యులేటరీ కమిటీ కన్సల్టెంట్ వేముల రామారావులను సన్మానించారు. సమావేశంలో హాస్టల్ ట్రస్ట్ ఆర్ఎస్‌కే. బూపాల్ రావు, కార్యదర్శి శ్రీనివాస, సభ్యులు కె.సురేశ్ చందర్ రావు, విద్యాసాగర్ రావు, వేణుగోపాల్, హాస్టల్ వార్డెన్ ప్రకాష్ రావు పాల్గొన్నారు.

కాళేశ్వరం అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలి

కవాడిగూడ: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీఐడీ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద శుక్రవారం నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి వేణుగోపాల్ గౌడ్, తెలంగాణ మహిళా అధ్యక్షురాలు జీనత్ బేగంలు మాట్లాడుతూ.... కేసీఆర్ పదేళ్ల పాలనలో నిర్మించిన కాళేశ్వరం ఆధారిత ప్రాజెక్టులపై సీఐడీ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్ల లైసెన్సులు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ ఇచ్చిన




ఇందిరాపార్కులో ఆందోళన చేస్తున్న నవరంగ్ పార్టీ ప్రతినిధులు

ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి వామపక్షాల రైతు సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.

28న మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈ నెల 28న కాచిగూడ లోని మ్యాడం అంజయ్య హాల్‌లో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్‌రావు తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ సభ్యులు పిల్లి శ్రీనివాస్ రావు, పన్నాల విష్ణు వర్ధన్, ఆకుల నాగేష్, యెలగందుల దేవేందర్, అమరం చంద్రశేఖర్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్‌రావు

హాజరుకానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రావు, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, జూనియర్ సివిల్ జడ్జి శాలిని శాకెల్లి, మల్క కొమురయ్య, ఐవి శ్రీనివాస్ రావు, కొండా సుస్మితా పటేల్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

డాక్టర్ మనోజ్‌రెడ్డికి బెస్ట్‌మెడికల్ ఆఫీసర్ అవార్డు



జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ మనోజ్ రెడ్డి

కాచిగూడ: భారత ఘనతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాచిగూడకు చెందిన యుపిహెచ్‌సీ, ఆర్‌హెచ్ ఎఫ్‌డబ్ల్యుటీసీ సెంటర్ డాక్టర్ ఎం.మనోజ్ రెడ్డి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా బెస్ట్ మెడికల్ ఆఫీసర్ అవార్డు అందుకున్నారు.

చిరంజీవికి అభినందన సత్కారం



చిరంజీవిని సన్మానిస్తున్న వీబీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడిపడిగె రాజు

కాచిగూడ: మెగాస్టార్ చిరంజీవికి భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా వీబీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడిపడిగె రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిరంజీవిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కాచిగూడ: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం. చిమ్నా నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాచిగూడ – మలక్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని మహిళ (54) గురువారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గాయపడింది. రైల్వే పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా, శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పద్మశాలీలు సంఘటితం కావాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



కవాడిగూడ: రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా రాణించాలంటే పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కులో నిర్వహించిన పద్మశాలీ రాజకీయ చైతన్య వేదికకు ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్త రమేష్, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందకట్ల స్వామి, ముషీరాబాద్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడు అతినగరం సుదేష్ నేత, సినీ హీరో రోషం బాలు, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి, అనంతరం పద్మశాలి నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.... అన్ని రంగాల్లో పద్మశాలీలు రాణించేందుకు ప్రాంతాలకు అతీతంగా హక్కులు సాధించుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు బైరి మనోహర్‌నేత, బోనం ఊర్మిళ, సోమ సతీష్ కుమార్, నిర్మల, ఎస్ శ్రీధర్, బోనం బన్నీ, ఎస్ గణేష్, బింగి నవీన్, కొండా శ్రీనివాస్, సిల్వేరు నారాయణ మూర్తి, ఎం దశరతం, పున్న సత్యనారాయణ, ఏయిర్‌టెల్‌రాజు, బొడ్డు తిరుపతి, బొట్టు శ్రీనివాస్, అంకం చంద్రమౌళి పాల్గొన్నారు.

నగర పద్మశాలి మేళాకు విశేష స్పందన

కవాడిగూడ: పద్మశాలి మేళా నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కులో నిర్వహించిన 45వ పద్మశాలి మేళాకు విశేష స్పందన లభించిందని పద్మశాలి మేళా కమిటీ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని వయసులవారికి క్రీడాపోటీలు నిర్వహించారు. నగర వ్యాప్తంగా పద్మశాలీలకు ఏర్పాటు చేసిన వివాహ పరిచయ వేదికకు భారీ స్పందన లభించిందన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ మేళా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. గత 45 ఏళ్లుగా ఇందిరాపార్కులో పద్మశాలి మేళా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్మశాలీల మేళాతో నగర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కమిటీ ఉపాధ్యక్షులు అనంతరాములు, ప్రధాన కార్యదర్శి పి. నాగమూర్తి, సంయుక్త కార్యదర్శి పి. సుదర్శన్, కోశాధికారి జీహెచ్ దానయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు మంచాలు అందజేస్తున్న బండారు సుబ్బారావు

కాచిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీల్‌వెల్ కార్పొరేషన్ చైర్మన్ బండారు సుబ్బారావు అన్నారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో మలక్‌పేటలోని దయానంద్ భవన్ సమితి వేద పాఠశాల విద్యార్థులకు ఆయన మంచాలు అందజేశారు. సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని, ఎంత సంపాదించినా రాని ఆనందం పేదరికంలో మగ్గుతున్న వారికి చేయూత అందించడంలో ఉంటుందన్నారు. ఉన్న దాంట్లో పేదలకు సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుడుగుంట్ల ధనుంజయ్, హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్, విశ్వనాథం నాగేష్, కూర రఘువీర్, పబ్బతి రవి ప్రసన్న కుమార్, పొద్దుటూరి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ సభ్యురాలు వరలక్ష్మికి సన్మానం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తరపున తెలంగాణ రాష్ట్రానికి కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన వరలక్ష్మిని శుక్రవారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షులు ఆర్.వివేక్, ప్రధాన కార్యదర్శి బి.వెంకటస్వామిగౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణలో ఆహార ధాన్యాల సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎం.దామోదర్‌రెడ్డి, సునీతారెడ్డి, పద్మాగౌడ్, శ్రీదేవిగౌడ్, సిరిగిరి కిరణ్, శైలజ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆశాదీపం భారత రాజ్యాంగం



ప్రమాణం చేయిస్తున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పీడిత ప్రజల ఆశాదీపం భారత రాజ్యాంగం అని టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లిక్ డేను పురస్కరించుకుని లౌకిక కవిగాయక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులు, బాధ్యతలు, పరిపాలన పద్ధతులు, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం కల్పించిందన్నారు. అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కును కూడా రాజ్యాంగమే కల్పించిందని గుర్తు చేశారు. అనంతరం భారత రాజ్యాంగంపై నిబద్ధతతో ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి అల్వాల సురేష్, వేణుమాధవ్, వంశీ, ఆశోక్ దుర్గే, డాక్టర్ నాగేశ్వర్‌రావు, జి.నరేష్, పొన్నం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

అంబర్‌పేట్: ఎమ్మెల్సీగా ఎంపికైన ప్రొఫెసర్ కోదండారామ్‌కు కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఆ పార్టీ ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, గరిగంటి రమేష్, పులి జగన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.